# అయ్యవారుగా మారిన కలెక్టర్ సార్





**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 10** :గుంతకల్లులోని డా.సరోజినీ నాయుడు పురపాలక ఉన్నత పాఠశాల (బాలికల)ను బుధవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి, విద్యార్థులతో భోజనం బాగుందా, రోజు ఏం మెనూ పెడుతున్నారు, భోజనం నాణ్యతగా ఉందా అంటూ ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. తదనంతరం పదవ తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు బోధించారు. పదవ తరగతిలో మ్యాథమెటిక్స్ లో త్రికోణమితి అనే చాప్టర్ లో ఒక ప్రాబ్లం ఇచ్చి దీనిని సాల్వ్ చేయాలని విద్యార్థులకు సూచించగా, కొంతమంది విద్యార్థులు ప్రాబ్లం పరిష్కరించారు. విద్యార్థులంతా కూడా మ్యాథ్స్ ప్రాబ్లంలను సాల్వ్ చేసేలా మంచి బోధన అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాక్షించారు.ఈ సందర్భంగా పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వజ్రకరూరు మండలంలో విలేజ్ హెల్త్ క్లినిక్ లను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 149 విలేజ్ హెల్త్ క్లినిక్లను మంజూరు చేయడం జరిగిందని, వాటిని రెండు మూడు నెలలలోపు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుం టున్నా మన్నారు. పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పెట్టుకోవడం జరిగిందని, రాబోయే పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర స్థాయిలో ప్రణాళిక తయారు చేయడం జరిగిందని, క్షేత్రస్థాయిలో ప్రణాళిక ఏ విధంగా అమలు అవుతుందో చూసేందుకు గుంతకల్లు పట్టణంలోని డా.సరోజినీ నాయుడు పురపాలక ఉన్నత పాఠశాల (బాలికల)ను తనిఖీ చేశామన్నారు. ఒకటి, రెండు లొకేషన్ లలో సిబ్బంది ఇబ్బందులు ఉన్నాయని, త్వరలో వాటిని పరిష్కరిస్తామన్నారు. అకడమిక్ ఇన్స్ట్రక్టర్ విద్యావలంటీర్ కు సంబంధించి జిల్లాలో 80 దాకా ఖాళీలు ఉన్నాయని, వారిని నియమించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చి యున్నారని, ఎక్కడైతే ఉపాధ్యాయుల సమస్య ఉన్న చోట కొంతవరకు పూర్తిగా నియమించేందుకు అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్బి శ్రీనివాస్, డిఎల్డిఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి,ఎంఈఓ2 సుబ్బరాయుడు, స్థానిక ప్రజాప్రతి నిధులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .